# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

తెలంగాణ | సంపుటి : 2 | సంచిక : 186 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | శనివారం 27 సెప్టెంబర్ 2025


## ఉపాధి హామీ పథకంలో భాగంగా
# ఇందిరమ్మ ఇళ్ల పనులు

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయం

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భలే గుడ్ న్యూస్..
- ఇది కదా కావాల్సింది
- పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ
- ప్రతి ఇంటి నిర్మాణంలో ఉపాధి పథకం కింది 90 రోజుల పాటు పనులు నిర్వహించేందుకు అనుమతులు
- ఇప్పటికే ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోన్న ప్రభుత్వం
- ఇప్పుడు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు, వ్యయాన్ని తగ్గించేందుకు



హైదరాబాద్

ఇంటి నిర్మాణ ఖర్చులు పెరగడంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు దిగింది. ఇప్పటికే ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోన్న ప్రభుత్వం.. ఇప్పుడు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు, వ్యయాన్ని తగ్గించేందుకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తోంది. కూలీల కొరత, పెరిగిన ఖర్చులు, లబ్ధిదారుల ఇబ్బందులు ఉన్న క్రమంలో.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఉపాధి హామీ పథకంతో అనుసంధానించాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఇళ్ల నిర్మాణానికి 90 రోజులు ఉపాధి పనులుగా గుర్తింపు లభిస్తుంది. రోజుకు రూ.307 చొప్పున కూలీలకు చెల్లింపు జరగనుంది. దీంతో మొత్తం 90 రోజులకు కూలీలకు - మిగతా3లో





## మోదీ-పుతిన్ మధ్య అలాంటి సంభాషణేమీ జరగలేదు

- నాటో చీఫ్ వ్యాఖ్యలను ఖండించిన భారత్
- ప్రధాని మోదీ, పుతిన్ మధ్య అలాంటి చర్చలు ఏమీ జరగలేదు
- 'రష్యా నుంచి చమురు కొంటోందన్న కారణంగా భారత్‌పై ట్రంప్ విధించిన అదనపు సుంకాలు రష్యాపై పెద్ద ప్రభావాన్ని చూపుతున్నాయి.



## ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి

- వర్షాలపై సీఎం సమీక్ష
- లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- అన్ని విభాగాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి
- నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలి
- హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలపై సీఎస్ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు - మిగతా3లో





## చాలా దేశాల్లో అవసరమైనంత శ్రామిక శక్తి లేదు

- విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్
- "గ్లోబల్ వర్క్‌ఫోర్స్ ఎక్కడ ఉండాలన్నది రాజకీయంగా చర్చనీయాంశం
- చాలా దేశాల్లో జనాభా పరిస్థితుల కారణంగా డిమాండ్‌ను కూడా పూర్తి చేసుకోలేని పరిస్థితి నెలకొంది
- హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



## 2417 మంది అమెరికా నుంచి భారత్‌కు

- "భారత ప్రభుత్వం చట్టపరమైన వలస మార్గాలను ప్రోత్సహిస్తుంది
- అక్రమ వలసలను వ్యతిరేకిస్తుంది
- అక్రమ వలసలను ప్రోత్సహించే వ్యక్తులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాం"
- విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడి

## 5 నుంచి 9 ఏళ్ల వయసున్న పిల్లల్లో ట్రైగ్లిజరైడ్స్ అధికం

- రక్తంలో ట్రైగ్లిజరాయిడ్స్ అధికంగా ఉంటే, భవిష్యత్తులో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం
- జమ్మూకశ్మీర్, వెస్ట్ బెంగాల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల పిల్లల్లో ఇది మరీ ఎక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం రిపోర్టు

## తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల
# జీవో విడుదల

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ
- బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిటీ సిఫార్సు
- 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నెంబర్ 9 విడుదల
- సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గడువు







## మీ ఫైటర్‌జెట్స్ వస్తే కూల్చేయడానికి సిద్ధం

- రష్యాను హెచ్చరించిన ఐరోపాదేశాలు
- తమ విమానాలు ఎస్తోనియా గగనతలంలోకి చొరబడలేదు
- నాటో మద్దతు లేకుండా కీవ్ అటువంటి ఆపరేషన్లు చేయలేదు
- నాటో కూటమి పూర్తి శక్తితో స్పందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఐరోపా దేశాలు రష్యాను హెచ్చరించాయి

## అరెస్టు చేసుకుంటారా? ఏం చేసుకుంటారో చేస్కోండి





- చూసి చూసి వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయి
- తన అరెస్టుపై కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారు
- హైదరాబాద్ మెట్రో నుంచి ఎల్ అండ్ టీ ఎందుకు అర్ధాంతరంగా పోయిందో.. సీఎం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్
- కరోనా కష్టకాలాన్ని కూడా ఎల్ అండ్ టీ ఎదుర్కొంది
- రాష్ట్ర విభజన తర్వాత రైడర్‌షిప్ తగ్గుతదన్న అపోహలను తట్టుకుని నిలబడ్డది

హైదరాబాద్

కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. తన అరెస్టుపై కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. చూసి చూసి వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఎల్ అండ్ టీ సంస్థపై మీడియాతో మాట్లాడిన సందర్భంగా కేటీఆర్ అరెస్టుపై ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఈ విధంగా బదులిచ్చారు. రేవంత్ రెడ్డి ఏం చేసినా దాని వెనుకాల ఓ స్కీమ్ ఉంటది.. దాని వెనుకాల ఓ స్కాం ఉంటుంది. ఇది పక్కా. ఆయన పేరుకే ముఖ్యమంత్రి కానీ ఆయన దందా బ్లాక్ మెయిల్. ఇవాళ చెప్పింది చిన్న విషయం.. ఇంకో - మిగతా3లో



## తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డి నియామకం

- డీజీపీగా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు
- రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్న శివధర్ రెడ్డి
- అక్టోబర్ 1న బాధ్యతలు స్వీకరించనున్న శివధర్ రెడ్డి

# 2417 మంది అమెరికా నుంచి భారత్‌కు




**ఇంటర్నెట్‌డెస్క్:** డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ వలసలపై కఠిన చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జనవరి నెల మొదలుకొని ఇప్పటివరకు 2,417 మంది అమెరికా నుంచి భారత్‌కు వచ్చారని శుక్రవారం విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు. వారిలో కొందరు బహిష్కరణకు గురికాగా.. మరికొందరు అక్కడ ఉండలేక తిరిగి వచ్చినవారని చెప్పారు "భారత ప్రభుత్వం చట్టపరమైన వలస మార్గాలను ప్రోత్సహిస్తుంది. అక్రమ వలసలను వ్యతిరేకిస్తుంది. ఏదైనా దేశంలో భారతీయులు ఎవరైనా చట్టపరమైన హోదా లేకుండా ఉంటే.. వారి నేపథ్యాన్ని తనిఖీ చేసి నిర్ధారించుకుంటాం. తర్వాత వారిని తిరిగి తీసుకువస్తాం. అక్రమ వలసలను ప్రోత్సహించే వ్యక్తులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాం" అని జైశ్వాల్ వెల్లడించారు. అక్రమ వలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేసిన సంగతి తెలిసిందే. చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానాల్లో వెనక్కి పంపిన సంగతి తెలిసిందే.

అమెరికా విశ్వవిద్యాలయాలకూ హెచ్-1బీ కష్టాలు..!

ఆ వ్యవహారంపై గతంలో భారత ప్రభుత్వం స్పందించిన సంగతి తెలిసిందే. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

# చాలా దేశాల్లో అవసరమైనంత శ్రామిక శక్తి లేదు



**ఇంటర్నెట్‌డెస్క్:** ప్రపంచ దేశాలకు గ్లోబల్ వర్క్‌ఫోర్స్ అవసరం ఉందని.. దానినుంచి అవి తప్పించుకోలేవని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వ్యాఖ్యానించారు. చాలా దేశాల్లో జనాభా పరిస్థితుల కారణంగా డిమాండ్‌ను కూడా పూర్తి చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన 'ఎట్ ది ఆర్ట్ ఆఫ్ డెవలప్‌మెంట్: ఎయిడ్, ట్రేడ్, అండ్ డెవలప్‌మెంట్' అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. "గ్లోబల్ వర్క్‌ఫోర్స్ ఎక్కడ ఉండాలన్నది రాజకీయంగా చర్చనీయాంశం. కానీ, దానికి ప్రత్యామ్నాయం లేదు. ఆయా దేశాల్లో డిమాండ్.. అక్కడి జనాభాను చూడండి. అందుకే చాలాచోట్ల డిమాండ్‌కు తగినంత శ్రామికశక్తి లేదు. ఇది వాస్తవం. దానినుంచి మీరు తప్పించుకోలేరు. అందుకే మనం మరింత సమర్థవంతమైన, సమకాలీన శ్రామిక శక్తిని సృష్టించాలి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ముందున్న అతిపెద్ద సవాలు ఇది.

**భారత సైన్యానికి మరింత 'తేజస్సు'**

ప్రపంచంలోని దేశాల మధ్య విభిన్నమైన వాణిజ్య ఒప్పందాలను మనం చూడబోతున్నాం. ఇతర పరిస్థితుల్లో తీసుకోలేని నిర్ణయాలను కూడా అమలుచేయడం చూడబోతున్నాం. భౌతిక, డిజిటల్ కారణాలతో నేడు వాణిజ్యం చాలా సులభమైపోయింది. మెరుగైన రోడ్లు, షిప్పింగ్, ఎన్నడూ లేనంత సరళమైన వాణిజ్య విధానాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. ప్రపంచం గత మూడు నాలుగేళ్లుగా పంపిణీ వ్యవస్థలు, ఉత్పత్తి సోర్సుల విషయంలో ఆందోళన చెందుతోందన్నారు.

# ట్రంప్‌తో పాక్ ప్రధాని షరీఫ్ రహస్య భేటీ.. ఏం చర్చించారు?



వాషింగ్టన్: దాయాది దేశం పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. అమెరికా పర్యటనలో ఉన్నారు. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో షెహబాజ్ షరీఫ్ భేటీ అయ్యారు. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో అంతర్గతంగా వీరి సమావేశం జరిగింది. ట్రంప్‌తో పాక్ ప్రధాని రహస్యంగా సమావేశమయ్యారు. మీడియాను అనుమతించలేదు. ఈ భేటీకి పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ కూడా హాజరైనట్టు తెలుస్తోంది. ఇరువురు నేతలు ఏ అంశంపై చర్చించుకున్నారనే ఆసక్తి నెలకొంది. ఇక, ట్రంప్‌తో షెహబాజ్ షరీఫ్ భేటీ కావడం ఇదే తొలిసారి. వివరాల ప్రకారం.. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పాక్ ప్రధాని షరీఫ్ అమెరికాకు వెళ్లారు. ఈ సందర్భంగా షరీఫ్‌కు ట్రంప్ స్వాగతం పలికారు. అనంతరం.. డొనాల్డ్ ట్రంప్, షహబాజ్ షరీఫ్ మధ్య సమావేశం జరిగిందని తెలుస్తోంది. ఇరువురు నేతలు రహస్యంగా భేటీ అయినట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో భాగంగా ఇరు దేశాల మధ్య దైపాక్షిక ఒప్పందాలు, ప్రాంతీయ భద్రతపై చర్చించినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక, ఈ సమావేశంలో వారితో పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ మునీర్ కూడా ఉన్నారని సమాచారం. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే, ప్రపంచ దేశాలపై ట్రంప్ వరుసగా పన్నులు విధిస్తున్న నేపథ్యంలో పాక్ ప్రధాని.. అమెరికా అధ్యక్షుడిని కలవడం గమనార్హం. మరోవైపు ఇప్పటికే పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ అమెరికాలో వరుస పర్యటనలు చేసిన సంగతి తెలిసిందే. మునీర్ గతంలో జూన్, ఆగస్టు నెలల్లో అమెరికాలో పర్యటించారు. జూన్ పర్యటనలో మునీర్‌కు ట్రంప్ వైట్ హౌస్‌లో విందు ఇచ్చారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ఆర్థిక అభివృద్ధిపై చర్చలు జరిగాయని కొన్ని మీడియా కథనాలు తెలిపాయి. ఆ తరువాత అమెరికా.. పాకిస్తాన్‌లో చమురు నిల్వలను అభివృద్ధి చేయడానికి సహాయం చేస్తామని ప్రకటించింది. అలాగే, పాకిస్తాన్‌కు ఖనిజ రంగంలో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడిని కూడా అమెరికా అందించింది.

# మీ ఫైటర్‌జెట్స్ వస్తే కూల్చేయడానికి సిద్ధం



**ఇంటర్నెట్‌డెస్క్:** గగనతల సరిహద్దులను ఉల్లంఘిస్తే నాటో కూటమి పూర్తి శక్తితో స్పందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఐరోపా దేశాలు రష్యాను హెచ్చరించాయి తాజాగా నాటో సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా మాస్కోలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల దౌత్యవేత్తలు రష్యా మిగ్-31 ఫైటర్‌జెట్ చొరబాట్లపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశం పూర్తిగా రహస్యంగా జరిగింది. దీని వివరాలు తెలిసిన ఓ అధికారి బ్లూమ్‌బెర్గ్ పత్రికకు వెల్లడించారు. రష్యా కమాండర్లు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతున్నారన్న అభిప్రాయానికి వచ్చారు. అయితే దీనిని రష్యా అధికారులు తిరస్కరించారు. తమ విమానాలు ఎస్తోనియా గగనతలంలోకి చొరబడలేదని.. నాటో పరీక్షించే చర్యలు కావని రష్యా అధికారులు వాదించారు. ఇక పోలెండ్ గగనతలంలోకి డ్రోన్లు చొరబడటంపై స్పందిస్తూ.. అది ఓ తప్పు కారణంగా చోటు చేసుకొందని వివరణ ఇచ్చారు. అయితే ఉక్రెయిన్ దాడికి ప్రతికారంగానే క్రిమియాలో తమ చర్యలు ఉన్నాయని వారు వెల్లడించారు. నాటో మద్దతు లేకుండా కీవ్ అటువంటి ఆపరేషన్లు చేయలేదని పేర్కొన్నారు. ఇక తాము ఐరోపా దేశాలతో పోరాడుతున్నట్లే భావిస్తున్నామన్నారు. ఈ సమావేశం జరిగిందని జర్మనీ అధికారులు ధ్రువీకరించారు. ఇక ఇటీవల క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ.. తమ యుద్ధవిమానాలు అంతర్జాతీయ నిబంధనలు పాటిస్తున్నాయని చెప్పారు. నాటో లోని తూర్పు ప్రాంత దేశాలు ఈ నెలలో పలుమార్లు రష్యా విమానాలు, డ్రోన్లు తమ గగనతలంలోకి వచ్చినట్లు వెల్లడించాయి. అవసరమైతే నాటో రష్యా విమానాలను కూల్చేయాలని ట్రంప్ కూడా ఇటీవల అభిప్రాయపడిన విషయం తెలిసిందే.

# అసెంబ్లీ ఎన్నికల తర్వాత జేడీయూకు భవిష్యత్తే లేదు




బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ పార్టీకి భవిష్యత్తే లేదని ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ అన్నారు. ఆ పార్టీలో బీజేపీ ఐడియాలజీతో ఉన్నవాళ్లు బీజేపీలోకి వెళ్తారని, సామాజిక న్యాయం, లౌకికవాదాన్ని విశ్వసించేవారు ఆర్జేడీలోకి వస్తారని వ్యాఖ్యానించారు. 'బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జేడీయూ పార్టీ ఉండదు. ఎందుకంటే ఆ పార్టీలో బీజేపీ ఐడియాలజీతో ఉన్నవాళ్లు బీజేపీలోకి వెళ్తారు. ఇక సామాజిక న్యాయం, లౌకికవాదాన్ని విశ్వసించే వారు మా పార్టీలోకి వస్తారు' అని వ్యాఖ్యానించారు. జేడీయూ మాజీ ఎమ్మెల్యే రేణూదేవి కుశ్వాహ ఇవాళ ఆ పార్టీకి రాజీనామా చేసి, ఆర్జేడీలో చేరారు. ఆర్జేడీ కార్యనిర్వాహక అధ్యక్షుడైన తేజస్వి యాదవ్ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తేజస్వియాదవ్ మాట్లాడుతూ.. జేడీయూపై, నితీశ్ కుమార్‌పై రాష్ట్ర ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు. పార్టీ క్యాడర్ కూడా నితీశ్ విధానాలతో అసంతృప్తిగా ఉందని తెలిపారు. అందుకే ఆ పార్టీ నుంచి నేతలు ఒక్కొక్కరుగా బయటికి వస్తున్నారని చెప్పారు.

## వీలైనంత త్వరలోనే అమెరికాతో ఒప్పందం

భారత్, అమెరికాలకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నాయని.. ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు పేర్కొంది. వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అగ్రరాజ్యం సైతం భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింత పెంచుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఇరుదేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయన్నారు. మరోవైపు అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి కి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సదస్సుకు అనుబంధంగా జరగనున్న మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీలో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దానిపై ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ తాజాగా ఫార్మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించారు. దీంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారాయి. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15శాతం భారత్ సరఫరా చేసినవే. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్, సన్‌ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి సంస్థల మొత్తం ఆదాయంలో 30-50శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లతో అమెరికా మార్కెట్‌లో ఈ ఔషధాల ధరలు రెట్టింపు కానున్నాయి.

## మోదీ-పుతిన్ మధ్య అలాంటి సంభాషణేమీ జరగలేదు




న్యూ ఢిల్లీపై ట్రంప్ విధించిన టారిఫ్‌లు రష్యాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుటె పేర్కొన్న విషయం తెలిసిందే. ట్రంప్ విధించిన టారిఫ్‌లతో ఇబ్బంది పడుతున్న న్యూఢిల్లీ.. రష్యా అధినేతతో ప్రధాని మోదీ మాట్లాడినట్లు తెలిపారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా వ్యూహంపై మోదీ ఆరా తీసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, ఆయన వ్యాఖ్యలపై భారత్ తాజాగా స్పందించింది. నాటో చీఫ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ప్రధాని మోదీ, పుతిన్ మధ్య అలాంటి చర్చలు ఏమీ జరగలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఫోన్ సంభాషణకు సంబంధించి నాటో చీఫ్ మార్క్ రుటె చేసిన వ్యాఖ్యలు మా దృష్టికి వచ్చాయి. ఆయన చెప్పినట్టుగా మోదీ-పుతిన్ మధ్య అలాంటి చర్చలు ఏవీ జరగలేదు. ఆయన చేసిన ప్రకటన తప్పు. పూర్తిగా నిరాధారమైనవి' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ తన అధికారిక ప్రకటనలో వెల్లడించింది. న్యూయార్క్‌లో నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుటె మాట్లాడుతూ.. 'రష్యా నుంచి చమురు కొంటోందన్న కారణంగా భారత్‌పై ట్రంప్ విధించిన అదనపు సుంకాలు రష్యాపై పెద్ద ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ సుంకాలతో భారత్ కూడా తీవ్ర ఇబ్బంది పడుతోంది. దీంతో రష్యా అధినేతకు ఢిల్లీ నుంచి ఫోన్ వెళ్తోంది. పుతిన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా వ్యూహంపై మోదీ ఆరా తీస్తున్నారు. భవిష్యత్ వ్యూహాల గురించి అడిగి తెలుసుకుంటున్నారు' అని మార్క్ రుటె వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి.

## 5 నుంచి 9 ఏళ్ల వయసున్న పిల్లల్లో ట్రైగ్లిజరైడ్స్ అధికం




**న్యూఢిల్లీ:** దేశంలో 5 నుంచి 9 ఏళ్ల మధ్య వయసున్న మూడోవంతు పిల్లల్లో ట్రైగ్లిజరైడ్స్ అధికంగా ఉన్నట్లు గుర్తించారు. జమ్మూకశ్మీర్, వెస్ట్ బెంగాల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల పిల్లల్లో ఇది మరీ ఎక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం రిపోర్టులో వెల్లడైంది. బెంగాల్‌లోని 67 శాతం, సిక్కింలోని 64 శాతం, నాగాలాండ్‌లోని 55 శాతం, అస్సాంలోని 57 శాతం, జమ్మూకశ్మీర్‌లోని 50 శాతం పిల్లల్లో అత్యధిక స్థాయిలో ట్రైగ్లిజరాయిడ్స్ ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. రక్తంలో ట్రైగ్లిజరాయిడ్స్ అధికంగా ఉంటే, భవిష్యత్తులో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. కేరళ, మహారాష్ట్ర పిల్లల్లో మాత్రం అత్యల్పంగా ట్రైగ్లిజరైడ్స్ ఉన్నట్లు తేల్చారు. కేరళలో 16.6 శాతం, మహారాష్ట్రలో 19.1 శాతంగా ఉంది. స్టాటిస్‌టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వశాఖ రిలీజ్ చేసిన చిల్డ్రన్ ఇన్ ఇండియా 2025 బుక్‌లో ఈ రిపోర్టు ఇచ్చారు. చండీఘడ్‌లో జరిగిన సీఎంసీఎస్‌ఎస్‌ఓ కార్యక్రమంలో ఈ రిపోర్టును రిలీజ్ చేశారు. ప్రభుత్వ మంత్రిత్వ కార్యాలయాలు, శాఖలు సేకరించిన డేటా ద్వారా అంచనా వేశారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2019-21, నేషనల్ న్యూట్రిషన్ సర్వే 2016-18 రిపోర్టులను ప్రచురించిన తరహాలో డేటాను సేకరించారు. ప్రి మాచ్యురిటీ, తక్కువ బరువు ఉన్న పిల్లల్లో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. అఫిక్సియా(ఆక్సిజన్ అందకపోవడం), గాయాలు, న్యూమోనియా వల్ల కూడా శిశువుల్లో మరణాలు చోటుచేసుకుంటున్నాయి. దేశంలో ఉన్న టీనేజర్లలో అయిదు శాతం మంది హైపర్‌టెన్సివ్‌గా ఉన్నట్లు గుర్తించారు. ఢిల్లీలో అత్యధికంగా హైపర్ పిల్లల సంఖ్య 10 శాతంగా ఉంది. ఆ తర్వాత యూపీ(8.6), మణిపూర్(8.3), చత్తీస్‌ఘడ్(7 శాతం) రాష్ట్రాలు ఉన్నాయి. భారత్‌లో ఉన్న 16 శాతం మంది టీనేజీ యువతలో ట్రైగ్లిజరైడ్స్ అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

# అరెస్టు చేసుకుంటారా?
# ఏం చేసుకుంటారో చేస్కోండి

-మొదటిపేజీ తరువాయి

నాలుగైదు రోజుల్లో ఒక పెద్ద విషయం కూడా చెబుతాను. ఇంకో కార్పొరేట్ సంస్థను ఎట్ల బ్లాక్ మెయిల్ చేశాడో అది కూడా చెప్తాను. ఆధారాలతో సహా చెప్తాను అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారు. వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయి. మమ్మల్ని అరెస్టు చేసుకుంటారా.. ఏం చేసుకుంటారో చేస్కోండి.. నేను ఏ తప్పు చేయలేదు. ఎంత ధైర్యం ఉంటే.. నేను ఒక మంత్రిగా పదేండ్లు పని చేశాను.. లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమని చెప్పాను. సీఎంను అడిగాను.. ఆయన స్పందించలేదు. ఏసీబీ కేసు ఇద్దరి మీద ఉంది.. మీ కెమెరాల ముందే లైడిటెక్టర్ టెస్ట్ తీసుకుంటా రండి అని చెప్పాను. ఇప్పుడు కూడా అదే ఆఫర్ ఇస్తున్నా.. నేను తప్పు చేయలేదు కాబట్టి నిజాయితీకి ధైర్యం ఎక్కువ.. నేను తప్పు చేయలేదు కాబట్టి నాకు ఆధైర్యం ఉంది. అరెస్టు చేసుకుంటారా..? ఏం చేసుకుంటారో వదిలేయండి. నన్ను అరెస్టు చేస్తే పైశాచిక ఆనందం వస్తుండొచ్చు సీఎం రేవంత్ రెడ్డికి అది కూడా ఒకే. కానీ మేం కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టం.. 4 వేల పెన్షన్.. తులం బంగారం, స్కూటీ ఇవన్నీ ఇచ్చేదాకా కాంగ్రెస్ ను వెంటాడుతూనే ఉంటాం.. నీవెన్ని డైవర్షన్ గేమ్‌లు ఆడినా మేం వదిలిపెట్టం కాంగ్రెస్ పార్టీని అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

### ఆ 280 ఎకరాల భూమిపై సీఎం రేవంత్ కన్నుపడింది.. కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ మెట్రో నుంచి ఎల్ అండ్ టీ ఎందుకు అర్ధాంతరంగా పోయిందో.. సీఎం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలాన్ని కూడా ఎల్ అండ్ టీ ఎదుర్కొంది. రాష్ట్ర విభజన తర్వాత రైడర్‌షిప్ తగ్గుతదన్న అపోహాలను తట్టుకుని నిలబడ్డది. ఒక వైపు మీరు చెబుతున్నారు తెలంగాణ రైజింగ్ అని.. మరి రైజింగ్ ఉంటే ఎల్ అండ్ టీ ఎందుకు పారిపోయే పరిస్థితి వచ్చిందో చెప్పాలి. స్వయంగా ఎల్ అండ్ టీ సంస్థను సీఎం బెదిరిస్తున్నారు నిస్సిగ్గుగా.. ఎల్ అండ్ టీ సీఎఫ్‌వో శంకర్ రామన్‌ను జైల్లో వేస్తా అని చెప్పాడు సీఎం రేవంత్ రెడ్డి. ఫ్రీ బస్సు వల్ల మెట్రోకు నష్టం జరుగుతుంద అని అన్నాడు శంకర్ రామన్. అంతే దానికి జైల్లో వేస్తా అన్నాడు సీఎం. నువ్వేమన్న నియంతవా.. నువ్వేమైనా కిమ్‌వా.. ఇంత అరాచకమా..? నీ ఇష్టమున్నట్టు మాట్లాడుతావా.. అహంకారపూరితంగా మాట్లాడుతావా..? మీ తప్పులు ఎత్తి చూపిస్తే జైల్లే వేస్తావా సమస్యను పరిష్కారించాల్సింది పోయి వార్నింగ్ ఇస్తున్నాడు సీఎం. ఎల్ అండ్ టీ వాళ్లు మాకు చుట్టాలా..? మాకేమన్న వ్యాపార భాగస్వామ్యం ఉందా..? అని కేటీఆర్ నిలదీశారు. ఎల్ అండ్ టీ మీద పగ ఈరోజుది కాదు.. మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు సెవనెన్త్ బ్లాక్‌లో కుంగాయి. నాడు ఎల్ అండ్ టీ సంస్థను పిలిస్తే ముందుకు వచ్చి రాష్ట్ర ప్రజల మీద రూపాయి భారం పడకుండా మేం పునర్ నిర్మాణం చేస్తామని ముందుకు వచ్చారు. అది ఆయన కోపం. కాళేశ్వరం కూలేశ్వరం అయిపోయిందని చెప్పి మొత్తుకుంటే లాభం అయితదని అనుకుంటే.. భారం పడకుండా మేం కడుతామంటే మేం చేసిన చిల్లర పంచాయతీ బంద్ అయిపోతదని రేవంత్ రెడ్డి భావించారు. ఆ తర్వాత ఎయిర్‌పోర్టు మెట్రో రద్దు. ఎల్ అండ్ టీ మీద వరుసగా మేడిగడ్డ నుంచి మెట్రో దాకా వెంటాడుతూ వేధిస్తూ ఉన్నాడు. దాని మీద కక్ష గట్టి వెళ్లిపోయేలా చేసింది రేవంత్ రెడ్డినే. బాంబులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎల్ అండ్ టీ అడ్డం వచ్చిందా..? ఇక్కడి కాంట్రాక్టుల్లో. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో ఎల్ అండ్ టీకి క్వాలిఫికేషన్ లేదట.. బాంబులేటి కంపెనీకి ఉందంట.. కక్ష గట్టి ఎల్ అండ్ టీని టెక్నికల్‌గా డిస్ క్వాలిఫై చేసి అవమాన పరిచి నేన్నుంత కాలం పని చేయకూడదని కక్ష కట్టి పంపించారు. వంత పాడకపోయినందుకు, రూ. 250 కోట్లు పెట్టి మేడిగడ్డ రిపేర్ చేస్తామని చెప్పినందుకు చివరకు ఈ రకంగా ఎల్ అండ్ టీని వెళ్లగొట్టిండు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎల్ అండ్ టీ సంస్థ వెళ్లిపోవడంతో ఇవాళ 15 వేల కోట్ల రూపాయాలు రాష్ట్ర ప్రజల నెత్తిమీద పడింది. సీఎం బ్లాక్ మెయిల్ రాజకీయాల వల్ల ఇది జరిగింది. మెట్రో నిర్వహణ నిమిత్తం ఎల్ అండ్ టీ సంస్థకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 280 ఎకరాల స్థలం ఇచ్చింది. ఐటీడీఏ ఉద్యోగులకు జీతాల్లేవు కానీ.. ఈ రాష్ట్ర ప్రజల రూ. 15 వేల కోట్ల భారం మోపారు. పలు కంపెనీలు రాష్ట్రాన్ని వదిలిపెడుతున్నాయి. ఈ 22 నెలల కాలంలో రూ. 2 లక్షల 20 వేల కోట్ల అప్పు చేశారు రేవంత్ రెడ్డి అని కాగ్ చెప్పింది. ఎల్ అండ్ టీ వెళ్లిపోవడం వల్ల మరో 15 వేల కోట్ల అప్పు. ఈ అప్పును ఎవరు కడుతారు. ఆర్టీసీ కార్మికులకు. ఉద్యోగులకు డీఏ ఇచ్చేందుకు, పదవీ విరమణ ఉద్యోగులకు బెనిఫిట్స్‌కు, ఆరు గ్యారెంటీలకు పైసల్లేవు. కానీ చిల్లర రాజకీయాలకు పైసలు ఖర్చు పెడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎల్ అండ్ టీ వెళ్లగొట్టడం వెనుకా పెద్ద ఎజెండా ఉంది.. ఎల్ అండ్ టీకి అప్పగించిన 280 ఎకరాల మీద సీఎం కన్ను పడింది. అయితే అమ్ముకోవచ్చు.. లేదా ఇంకెవరికైనా వారికి దగ్గరగా ఉండే సంస్థలకు అమ్ముకోవచ్చు. ఇది సీఎం ఎత్తుగడ. అలాగే కొన్ని మాల్స్ ఉన్నాయి. వాటిని ఎవరెవరికి రాసుకుంటారో.. అడ్డగోలు దోపిడీకి ఎలా తెర తీస్తారో మీరందరూ చూస్తారు. చెప్పేటోళ్లకు లేదు కానీ రాసేటోళ్లకు అయినా ఉండాలి కదా..? పీపీపీ అంటే పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్ కదా.. మెట్రోను లీజుకు ఇచ్చింది.. ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు కూడా లీజుకు ఇచ్చిందే. ఇవాళ రేవంత్ రెడ్డి నిర్వాకం 15 వేల కోట్ల అప్పు ప్రజల మీద రుద్దుతుంటే దాన్ని అందంగా రాస్తారు అని కేటీఆర్ మండిపడ్డారు.

### సీఎం రేవంత్ అహంకారం వల్లే ఎల్ అండ్ టీ వెళ్లిపోయింది

పెట్టుబడులకు స్వర్గధామంగా ఉన్న హైదరాబాద్ నుంచి ఆ సంస్థ వెళ్లిపోయిందంటే అది తెలంగాణ రాష్ట్రానికి మాయని మచ్చ అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నిన్న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయాన్ని చాలా బాధ్యతరాహిత్యంగా, ఆలోచనరహితంగా తీసుకుంటే.. అదేదో గొప్ప పని అన్నట్టు రాష్ట్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ వార్తా పత్రికలు, ప్రసార మధ్యామాలు రాశాయి. తప్పుడు కథనాలు రాసిన పత్రికలకు, ప్రజలకు సమగ్రంగా చెప్పాలని ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. 2014లో మేం బాధ్యత తీసుకున్నప్పుడు మెట్రో పనులు కేవలం 25 శాతం మాత్రమే పనులు అయ్యాయి.. 2008లో వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు పబ్లిక్ ప్రయివేటు పార్టనర్‌షిప్‌లో మెట్రో కోసం టెండర్లు పిలిచారు. మెటాస్ సంస్థ వచ్చింది.. చాలా ఆశ్చర్యంగా పత్రికలు రాశాయి. ఈ సంస్థ ఉల్టా ప్రభుత్వానికి పైసలు ఇస్తదని రాశారు. మెట్రో లాభసాటి అని చెప్పడానికి ప్రయత్నించాయి. ఆ సంస్థ వెనక్కిపోయి ఎల్ అండ్ టీ టెండర్ తీసుకుంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దదైన పబ్లిక్ ప్రయివేటు పార్టనర్ షిప్ భాగస్వామ్యంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్ పిలిచి ఫైనల్ చేసి ఎల్ అండ్ టీకి అప్పగించింది అని కేటీఆర్ గుర్తు చేశారు. 2014లో రాష్ట్రం ఏర్పడే నాటికి పని మెట్రో పనులు 25 శాతం పూర్తయ్యాయి. కేసీఆర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత.. ప్రజా రవాణను మెరుగుపరచాలని, ఐటీ ఉద్యోగులకు మేలు చేయాలనే ఉద్దేశంతో మెట్రోను త్వరితగతిన పూర్తి చేశారు. రాబోయే రోజుల్లో ఐటీ ఉద్యోగులు మూడు రెట్లు పెరుగుతారని, ఉజ్వల నగరంగా పెరుగుతుందని చెప్పి నాడు కేసీఆర్ మొత్తానికి 2017 నాటికి మెట్రో మొదటి దశ పూర్తి చేశాం. ప్రధానిని ఆహ్వానించి నవంబర్ 29న 2017న ప్రారంభించాం అని కేటీఆర్ తెలిపారు. ఆ తర్వాత కొవిడ్ వచ్చింది. ప్రజా రవాణా స్తంభించిపోయే పరిస్థితి. మళ్లీ ఎల్ అండ్ టీ వారు కంగారు పడ్డారు. వడ్డీ లేని రుణం ఇస్తామని చెప్పి.. 2070 దాకా నడపాలని ధైర్యం చెప్పి ప్రభుత్వం నుంచి సాఫ్ట్ లోన్ కింద రూ. 900 కోట్లు కేబినెట్ అనుమతితో ఇచ్చాం. ఎల్ అండ్ టీ ముందుకు పోయింది. పీక్ అవర్స్‌లో సరిపోవట్లేదు కోచ్‌లో పెంచండి అని అడిగారు. అందుకు అనుగుణంగా కోచ్‌లు కూడా పెంచామని కేటీఆర్ తెలిపారు. 69 కిలోమీటర్లు మెట్రోను పూర్తి చేశాం పాతబస్తీ మినహా. హైటెక్ సిటీ ఆవాస హోటల్ వద్దకే మెట్రో ఉంటే.. ఐటీ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని దాన్ని రహేజా మైండ్ స్పేస్ వరకు పొడిగించాం. అర్ధవంతంగా, ఆలోచనతో మెట్రోను పూర్తి చేశాం. రెండో అతిపెద్ద మెట్రో నెట్ వర్క్ దేశంలో రెండో అతిపెద్ద వ్యవస్థ మేం దిగిపోయ నాడు. ఇంకో పని చేశాం. దిగపోయే ఆరు నెలల ముందు.. మెట్రో నగరాల్లో ఎయిర్‌పోర్టుకు మెట్రో ఉందని ఆలోచన చేసి.. మైండ్ స్పేస్ నుంచి శంషాబాద్‌కు ఓఆర్ఆర్ వెంట టెండర్ పూర్తి చేశాం. శంకుస్థాపనం చేశాం. ఎల్ అండ్ టీ టెండర్ దక్కించుకుంది.. పనులు ప్రారంభించడమే మిగిలి ఉండే. ఓఆర్ఆర్ చుట్టూ మెట్రో రైలు కారిడార్‌కు స్థలం సేకరించి పెట్టారు వైఎస్సార్. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని.. శంషాబాద్ వరకు ఎయిర్‌పోర్టు మెట్రో కోసం ప్రయత్నం చేశాం. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రజా రవాణా మెరుగుపరచాలనుకున్నాం. శంషాబాద్‌లో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఇక్కడికి వచ్చి పని చేసుకునేందుకు ఆలోచన చేశాం.. 37 కిలోమీటర్ల ఎయిర్‌పోర్టు మెట్రోకు బీఆర్ఎస్ ప్రభుత్వం అంకురార్పణ చేసింది అని కేటీఆర్ గుర్తు చేశారు. 400 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు కేసీఆర్ కేబినెట్ పచ్చజెండా ఊపింది. 160 కిలోమీటర్లు ఓఆర్ఆర్ చుట్టూ, ఇక మితగాది భువనగిరి, సంగారెడ్డి, షాద్‌నగర్, కడ్తాల్ దాకా కేబినెట్ ఆమోదం ఇచ్చాం. దశల వారీగా చేస్తామని చెప్పాం. ప్రజా రవాణాకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. మెట్రోను కాపాడుకుంటూ, విస్తరణకు ఏర్పాట్లు చేసుకుంటూ.. సమగ్రమైన ప్రణాళికతో ముందుకు పోయాం. ఈ ప్రభుత్వం వచ్చి రాగానే మొదట్టమొదటి నిర్ణయం.. ఎయిర్ పోర్టు మెట్రోను అనాలోచితంగా రద్దు చేశారు. ఈ పాటికి అయిపోయేది.. రెండేండ్లు దాని టర్మ్. కేటీఆర్ భూములు ఉన్నాయట అని పిచ్చి ఆలోచనలతో ఎల్ అండ్ టీకి దెబ్బ కొట్టారు. వాళ్లను వెళ్లగొట్టారు. అక్కడ్నుంచి రేవంత్ రెడ్డికి ఎల్ అండ్ టీకి పంచాయతీ మొదలైంది అని కేటీఆర్ గుర్తు చేశారు.

## చెరువుల మారిన రోడ్లు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అనిల్ (శుభోదయం న్యూస్)



సంగారెడ్డి పట్టణంలోని భారీ నుంచి అతి భారీ వర్షాలు పడడం వలన రోడ్లన్నీ చెరువులయ్యాయి. ప్రయాణికులకు ఇబ్బందిగా తయారైంది. ఇప్పటికే వాతావరణ శాఖ సంగారెడ్డికి రెడ్ అలర్ట్ ఇవ్వడం జరిగింది. అత్యవసరం అయితేనే కానీ బయటకు రావద్దు అని సంగారెడ్డి రూరల్ ఎస్సై అన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అనిల్ (శుభోదయం న్యూస్ )




ఆందోల్ మండలం నాగలాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం లో ముఖ్య అతిథి కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపెట్ల స్కైలాన్ బాబు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతి మేల మాణిక్యం హాజరయ్యారు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాన్ బాబు గారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి ఆశయాలను మనమందరం గుర్తించాలని ఆయన అన్నారు, మనమందరం ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాగులాపూర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జుంజురు రవి, ఉపాధ్యక్షులు తలారి రవి, ప్రధాన కార్యదర్శి కొత్త్తొల్ల నర్సింలు, కార్యదర్శి డప్పు లక్ష్మణ్, సలహాదారులు డబ్బు రాజు, మరియు కిరణ్,రాజు, జైపాల్, ప్రసాద్ మహేందర్ మరియు గ్రామ పెద్దలు యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోనాపూర్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

రామాయంపేట (శుభోదయం న్యూస్) సెప్టెంబర్ 26:-



మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలేని పేదల కోసం వెట్టి చాకిరి నిర్మూలన కోసం పోరాడి,దున్నేవాడికే భూమి కావాలి అనే నినాదంతో నైజాం దోపిడీదారులపై పోరాటం చేసిన చాకలి ఐలమ్మను స్మరించుకుంటూ ఈ వేడుకలు నిర్వహించడం జరిగిందన్నారు.చాకలి ఐలమ్మ పోరాటం తెలంగాణ రైతాంగ చరిత్రలో మైలురాయి అని,భూమి కోసం,భుక్తి కోసం సమానత్వం కోసం ఆమె చేసిన త్యాగం బావి తరతరాలకు మార్గదర్శకమన్నారు. నైజాం దొరల అన్యాయాలను ఎదుర్కొంటూ సాధారణ గ్రామీణ మహిళగా రైతాంగ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట మాజీ ఎంపీపీ నర్సంపేట బిక్షపతి,కాంగ్రెస్ నాయకులు కరికే విద్యాసాగర్,రజక సంఘ అధ్యక్షులు మామిడి బాబు,ఉపాధ్యక్షులు మామిడి సతీష్,జిల్లా ముఖ్య సమన్వయకర్త మామిడి సిద్ధిరాములు,చాకలి భీమయ్య,యాదగిరి తదితరులు పాల్గొన్నారు. స్థానిక గ్రామస్తులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు.

## అక్కన్నపేట గ్రామంలో గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

రామాయంపేట (శుభోదయం న్యూస్) సెప్టెంబర్ 26:-



మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన వగ్గు సిద్దరాములు (69) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మేస్త్రి పని చేసే వృత్తితో జీవనం సాగిస్తున్న సిద్దరాములు కొంతకాలంగా వెన్నుముక సమస్యతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు.గత 24వ తేదీ రాత్రి సుమారు 8.20 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పాత గడ్డి మందు (ట్రైకాట్ కంపెనీకి చెందినది) తాగాడు. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి మార్చారు.అయితే చికిత్స పొందుతూ శుక్రవారం రోజు ఉదయం సుమారు 6.20 గంటలకు సిద్దరాములు మృతిచెందాడు. బాధితుని కుమారుడు అగు వగ్గు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కేసీఆర్‌ను కడిగిపారేసిన కాగ్


**హైదరాబాద్ :** కేసీఆర్.. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా, ప్రత్యేక రాష్ట్ర సాధకుడిగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. ఇక పదేళ్లు తెలంగాణ ముఖ్యమంత్రిగా సమసర్థవంతంగా పనిచేశారు. అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రైతుబంధు, రైతుబీమా, పింఛన్లకు మంచి గుర్తింపు ఉంది. అయితే కేసీఆర్ పాలన అంతా మేడిపండు చందమే అని కాగ్‌స్పష్టం చేసింది. తొమ్మిదేళ్ల పాలనలోని డొల్ల తనాన్ని బయట పెట్టింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన నిర్ణయాలు, అప్పుల ఊబిలో కూరుకుపోయిన నిర్వహణ, ప్రజోపయోగ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వంటివి ఈ నివేదికలో ప్రధానంగా వెల్లడయ్యాయి. తొమ్మిదేళ్లలో తెలంగాణ బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.9.12 లక్షల కోట్లకు చేరింది, ఇందులో జీతభత్యాలు, పరిపాలన ఖర్చులు, రుణాల వడ్డీలు, చెల్లింపులు ప్రధాన భాగం. అకేసీఆర్.. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా, ప్రత్యేక రాష్ట్ర సాధకుడిగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. ఇక పదేళు తెలంగాణ ముఖ్యమంత్రిగా సమసర్థవంతంగా పనిచేశారు. అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రైతుబంధు, రైతుబీమా, పింఛన్లకు మంచి గుర్తింపు ఉంది. అయితే కేసీఆర్ పాలన అంతా మేడిపండు చందమే అని కాగ్ స్పష్టం చేసింది. తొమ్మిదేళ్ల పాలనలోని డొల్ల తనాన్ని బయట పెట్టింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన నిర్ణయాలు, అప్పుల ఊబిలో కూరుకుపోయిన నిర్వహణ, ప్రజోపయోగ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వంటివి ఈ నివేదికలో ప్రధానంగా వెల్లడయ్యాయి. తొమ్మిదేళ్లలో తెలంగాణ బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.9.12 లక్షల కోట్లకు చేరింది, ఇందులో జీతభత్యాలు, పరిపాలన ఖర్చులు, రుణాల వడ్డీలు, చెల్లింపులు ప్రధాన భాగం. అదే సమయంలో, రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన కేపిటల్ వ్యయం కేవలం రూ.2.55 లక్షల కోట్లతో సరిపెట్టారు. ఈ అసమతుల్యత రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి లేనట్లు చూపిస్తుంది. రెవెన్యూ వ్యయంలో 85% జీతాలు, సబ్సిడీలు, నిర్వహణ ఖర్చులకే సరిపోయింది, కొత్త ఆస్తుల సృష్టి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటించలేదు. దీంతో రాష్ట్ర అప్పులు భారీగా పెరిగాయి. 2014లో రూ.79,880 కోట్లుగా ఉన్న రాష్ట్ర అప్పు, 2023 నాటికి బడ్జెటరీ అప్పులు రూ.3.56 లక్షల




కోట్లకు, బడ్జెటేతర అప్పులు రూ.1.98 లక్షల కోట్లతో కలిపి మొత్తం రూ.5.07 లక్షల కోట్లకు చేరింది. జీఎస్‌డీపీలో గ్యారంటీ అప్పులు 10% మించకూడదనే నిబంధనను ఉల్లంఘిస్తూ, తెలంగాణ 15% దాటిన ఏకైక రాష్ట్రంగా నిలిచింది. ఈ అప్పులు కేవలం అభివృద్ధి కోసం కాక, నిర్వహణ ఖర్చుల కోసం కూడా తీసుకోవడం గాడితప్పిన ఆర్థిక వ్యవస్తకు నిదర్శనం.కేసీఆర్ పాలనలో కాళేశ్వరం సింహభాగం నిధులను మింగేసింది. మొత్తం కేపిటల్ వ్యయంలో రూ.లక్ష కోట్లు నీటిపారుదలకు, ప్రధానంగా కాళేశ్వరంపై ఖర్చు చేశారు. సీతారామ, పాలమూరు వంటి ఇతర ప్రాజెక్టులకు నామమాత్రంగా నిధులు కేటాయించారు. దక్షిణ తెలంగాణలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కాళేశ్వరం బరాజు నిర్మాణంలో అవినీతి, నాణ్యతా లోపాలు రాష్ట్రానికి భారమయ్యాయి.కేసీఆర్ పాలనలో విద్య, వైద్య రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. తొమ్మిదేళ్లలో విద్యపై కేవలం రూ.2,550 కోట్లు ఖర్చు చేయగా, వైద్య రంగంలో సంవత్సరానికి రూ.700 కోట్లు కూడా కేటాయించలేదు. తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలు కొత్త పాఠశాలలు, ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల నిర్మాణంలో భారీ పెట్టుబడులు పెట్టాయి, కానీ తెలంగాణ వెనుకబడిపోయింది. గురుకుల విద్యాసంస్థలకు సొంత భవనాలు నిర్మించే ప్రయత్నం కూడా గాలికొదిలేశా రు. తెలంగాణలో పరిశ్రమలు, పెట్టుబడులపై దృష్టి సన్నగిల్లింది. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాలు పరిశ్రమల ప్రోత్సాహం ద్వారా ఉద్యోగాలు సృష్టించాయి, కానీ తెలంగాణలో నిజాం సుగర్స్, రేయాన్స్ వంటి సంస్థలు దుర్వినియోగంతో కుదేలయ్యాయి. ఇక రవాణా రంగంలో కేవలం రూ.19,948 కోట్లు ఖర్చు చేశారు, ఇది ఆంధ్రప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాలతో పోలిస్తే చాలా తక్కువ. రహదారులు, పోర్టులు, లాజిస్టిక్స్ వంటి భవిష్యత్తు ఉపయోగకరమైన మౌలిక వసతులపై పెట్టుబడులు గణనీయంగా తగ్గాయి.మిషన్ భగీరథ కింద రూ.38 వేల కోట్లు, హౌసింగ్ కోసం రూ.13 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చూపించినా, ఫలితాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం గొప్పలు చెప్పినా, అమలు నిరాశాజనకంగా సాగింది. ఇలాంటి పథకాలు ప్రచారానికి మాత్రమే పరిమితమయ్యాయి. విద్యుత్ రంగంలో రూ.21 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పినా, అదనపు విద్యుత్ సామర్థ్యం చాలా తక్కువగా ఉంది. పవర్ ప్రాజెక్టులు, కారిడార్‌లు వంటివి పెద్దగా ఫలితాలను ఇవ్వలేదు.కేసీఆర్ పాలన తెలంగాణను ఆర్థిక గందరగోళంలోకి నెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అతిగా దృష్టి సారించడం, విద్య, వైద్యం, పరిశ్రమలు, రవాణా వంటి కీలక రంగాలను నిర్లక్ష్యం చేయడం, అప్పుల భారంతో రాష్ట్రాన్ని ఊబిలోకి నెట్టడం తదితర అంశాలను కాంగ్ స్పంగా వెల్లడించింది. తెలంగాణ స్వప్నం ఆర్థిక అస్తవ్యస్తతలో చిక్కుకున్న ఈ దశాబ్దం, రాష్ట్రానికి ఒక హెచ్చరికగా నిలిచింది. ఈ లోపాలను సరిదిద్దుకుని, ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగడం ఇప్పుడు తెలంగాణకు ఉన్న అతిపెద్ద సవాల్.

# బాబోయ్ కుక్కలు.. పీకేస్తున్నాయి పిక్కలు





**బరంగెడ్డి గ్రామంలో ముగ్గురిని గాయపరిచిన కుక్కలు.**
**బీర్కూర్ పట్టణంలో 30 కుక్కల గుంపు వీరంగం.**

బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో ఓ కుక్కల బెడద తీవ్రస్థాయి కి చేరుతుంది అని బీర్కూర్ మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న మండలం లోని బరంగేడిగీ గ్రామం కామప్ప అనే వ్యక్తి కి గురువారం నాడు తీవ్రంగా గాయపరిచిన గ్రామ సింహాలు. చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపినారు. ఇదిలా ఉండగా శుక్రవారం రోజు కూడా మరో ఇద్దరు లింగం,మహేందర్ లను కరిచి గాయపరిచినట్లు గ్రామస్థులు తెలిపారు. లింగం ఉదయం బ్రెష్ చేస్తూ బయటకు రాగానే ఒకేసారి దాడి చెయ్యగా గాయమైనట్లు తరువాత మరో వ్యక్తికి కరిచినట్లు తెలిపారు, చికిత్స నిమిత్తం మండల కేంద్రం లోని ప్రాథమిక ఆసుపత్రి కి వచ్చి చికిత్స చేసుకున్నారు. బీర్కూర్ పట్టణ కేంద్రం లో సుమారు ఒకేసారు 20 కుక్కల వరకు సంచరిస్తూ వెళ్తున్న దృశ్యాలు గమనిస్తున్న ప్రజలు చూసి జంకుతున్నారు. బయటకు రావాలన్న రాత్రి పూట ద్విచక్ర వాహనాల పైన వెళ్ళిన వెంబడించి భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల కుక్క కాటు వల్ల రెబీస్ వ్యాధి వస్తుంది అని సోషల్ మీడియాలో అలాగే వార్తల్లో ప్రచురితం ఐతున్న విషయాలను గమనిస్తున్న ప్రజలు. దీనికి తీవ్రమైన భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పంచించాలని ప్రజలు కోరుతున్నారు.

# వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత ఐలమ్మ

**సిర్పంగి స్వామి, సిపిఎం మండల కార్యదర్శి**

వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):

తెలంగాణ ప్రజలను పట్టిపీడిస్తున్న దొరలదోపిడీ పీడన, జాగీర్దార్,పటేల్ పట్వారిల అరాచకాలను,నైజాం రజాకార్ మూకల దోపిడీ దౌర్జన్యాలపై వీరోచితంగా పోరాడి నరహంతకుడు విసునూరు రామచంద్రారెడ్డిని తరిమి కొట్టడంలో కీలకంగా వ్యవహరించి ప్రపంచానికి మహిళా చైతన్యాన్ని చాటిచెప్పిన వీరవనిత చిట్యాల ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని,ఆమె ఆశయ సాధనకు పునరంకితం కావడమే వారికిచ్చే ఘననివాళని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామిఅన్నారు.శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసినివాళులర్పించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా కిష్టాపురం గ్రామంలో పుట్టిన చాకలి ఐలమ్మ చిన్ననాటి నుండే దొరల దోపిడీదారుల పీడలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ ఆంధ్ర మహాసభ సభ్యురాలుగా చేరి విసునూరు రేపాక రామచంద్రారెడ్డి దోపిడీ దౌర్జన్యాలు,వెట్టి చాకిరి విముక్తి,భూమి,భుక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వన పోరాడిందన్నారు,అతి క్రూరుడుగా ఉన్న విసునూరు రామచంద్రారెడ్డి ఆనాడు ప్రజలపై విపరీతమైన పనులు వేస్తూ శిస్తులు వసూలు చేస్తూ ప్రజల్ని దోచుకోవడం కాకుండా మహిళలపై దౌర్జన్యాలు, చేయడానికి చూసి చాకలి ఐలమ్మ సహించలేకపోయిందని గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రజలను చైతన్యం చేస్తూ ఆంధ్ర మహాసభలో సభ్యులుగా చేరి దొరలపై తిరుగుబాటు చేసిన వీర వనిత అన్నారు.ఆమె స్ఫూర్తితో తెలంగాణ పల్లెల్లో అనేక గ్రామాలు



దొరలపై తిరుగుబాటు చేశాయని దోపిడీ పీడనలను ఈ పోరాటం ద్వారా విముక్తి జరిగిందన్నారు ఐలమ్మ ఆశయాన్ని సాధించడం అంటే దోపిడీ,పీడనలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడటమేనని అన్నారు నాటి పోరాటంలో పాల్గొని మొత్తం సమాజ మార్పు కోసం ఎర్రజెండా నాయకత్వంలో పోరాడిన నాయకులకు కులాలను అంట గట్టి వారి పోరాట స్ఫూర్తిని తగ్గించే కుట్ర చేస్తున్నారన్నారు కోవలోనే వీరనారి ఐలమ్మ పోరాటాన్ని పోరాడిన విధానాన్ని మరుగున పరిచేందుకు ఆమెను ఒక కులానికి పరిమితం చేసే కుట్రలను పాలకవర్గాలు చేస్తున్నాయన్నారు. ఆమె పోరాట వారసత్వాన్ని ప్రజలకు వివరించాలని నేడు దేశాన్ని ఏలుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ,భారత రాజ్యాంగాన్ని, మార్చేందుకు ప్రయత్నిస్తున్న పాలకవర్గాలపై ఆమె స్ఫూర్తితో తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం,మండల కమిటీ సభ్యులు కల్యూరి రామచంద్రర్,నాయకులు రాదారపు మల్లేశం,పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య,నారి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకల్లో మితిమీరిన డీజే శబ్దం నివారణకు చర్యలు తీసుకోండి..!

**అడిషనల్ డీసీపీ(అడ్మిన్), ఏసీపీలను కలిసిన శ్రీ సీతారామ సేవా సమితి మహిళలు**
**పోలీస్ అధికారులకు సమర్పించిన వినతి పత్రం**

రామగుండం మండలం, రిపోర్టర్- శుభోదయం న్యూస్):

రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ పండుగ ఉత్సవాలు ఉత్సాహంగా జరుపుకుంటున్న ఈ సమయంలో, మితిమీరిన డీజే శబ్దాలు ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్నాయని శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ లోని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) శ్రీనివాస్ తోపాటు గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో ఇటీవల బతుకమ్మ ఆడుతున్న ఇద్దరు మహిళలు, మితిమీరిన డీజే సౌండ్ వలన గుండె పోటుతో మృతి చెందిన విషాద ఘటనను గుర్తుచేస్తూ, ఇలాంటి సంఘటనలు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కూడా చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. గోదావరిఖనిలోని వన్ టౌన్, టూ టౌన్, ఎన్టీపీసీ, రామగుండం పోలీస్ స్టేషన్ల పరిధిలో 90 డెసిబల్స్ కు మించి శబ్ద కాలుష్యాన్ని వ్యాపింపజేస్తున్నారని ఆరోపించారు. మితిమీరిన డీజే సౌండ్ తో వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులతో పాటు గుండె సమస్యలు ఉన్నవారికి తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తున్నాయన్నారు. వెంటనే డీజే సౌండ్ వినియోగించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరగా, స్పందించిన పోలీస్ అధికారులు, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని స్టేషన్లను అప్రమత్తం చేయనున్నట్టు తెలిపారు. సమాజ హితం కోసం వినతి పత్రాలను సమర్పించడానికి వచ్చిన స్వచంద సేవా సమితి మహిళలను పోలీస్ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు కంది సుజాత, బిల్ల శ్రీదేవి, కే.రమాదేవి, కే.శ్యామల తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

**: వీరస్వామ**

వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):



భారత కమ్యూనిస్టు పార్టీ వలిగొండ మండల సమితి చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో నివాళులర్పించిన సిపిఐ వలిగొండ మండల సమితి ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కృష్ణాపురం గ్రామంలో జన్మించింది, చిన్న వయసులోనే బాల్యవివాహం చిట్యాల నరసయ్యతో జరిగినది.నాడు జరుగుతున్న దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పంట భూములను రక్షించుకోవడానికి తిరుగుబాటు చేసిన మొట్టమొదటి మహిళ చాకలి ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముందు నడిచి మహిళలను చైతన్యపరచిన గొప్ప పోరాట యోధురాలు అని అన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళా యూనివర్సిటీకి తన పేరు పెట్టడం హర్షనీయం వ్యక్తం చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్,పోలేపాక యాదయ్య,పట్టణ కార్యదర్శి సల్వాది రవీందర్, బొడిగే సుదర్శన్,సుద్దాల సాయికుమార్, పారుపల్లి నరసింహ, మాద సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత పూజా కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు తాటి కృష్ణయ్య



మంగపేట, సెప్టెంబర్ 26, (శుభోదయం న్యూస్) రిపోర్టర్: తులసి: మంగపేట మండలం, తిమ్మంపేట గ్రామంలో యూత్ మరియు గ్రామస్తులు, కలిసి దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేయగా నవరాత్రుల సందర్భంగా దుర్గామాత విగ్రహా పూజా కార్యక్రమానికి, ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తాటి కృష్ణయ్యను, చిట్టిమల్ల సమ్మయ్య ఆహ్వానించగా. దుర్గామాత పూజా కార్యక్రమంలో పాల్గొని.తిమ్మంపేట గ్రామ ప్రజలకు మరియు మండల ప్రజలకు, మంచి జరగాలని తాటి కృష్ణయ్య కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులుగాద శ్రీనివాసాచారి తిమ్మంపేట దుర్గామాత కమిటీ సభ్యులు, దిడ్డి కాశీనాదం, లోడిగే మధుకర్, పల్నాటి సతీష్,గుండు నాగయ్య, వాసం రాజు, పోలిపోయిన అర్జున్ రావు, దుర్గం సావిత్రి కుమార్, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 130వ చాకలి ఐలమ్మ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించిన ఎఫ్. సి. ఐ రజక సంఘం నాయకులు

గోదావరిఖని టౌన్, రిపోర్టర్- (శుభోదయం న్యూస్):



ఆర్ ఎఫ్ సి ఎల్, ఎఫ్ సి ఐ గేటు అందు చాకలి ఐలమ్మ 130 వ జయంతి చిత్రపటానికి పూలమాలలు వేసి. కేకు కటింగ్ చేసి ఘనంగా స్వీట్లు పంపిణీ చేస్తూ అన్ని కుల సంఘాల అన్ని పార్టీ నాయకుల ఆధ్వర్యం లో ఘనంగా 130వ జయంతి కార్యక్రమం ఎఫ్ సి ఐ, ఆర్ ఎఫ్ సి ఎల్ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## మానవత్వం చాటుకున్న మల్దకల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సుధాకర్

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్
(శుభోదయం న్యూస్) :



జోగులాంబ గద్వాల జిల్లా శుక్రవారం మల్దకల్ మండలం పరిధిలోని బూడిదపాడు స్టేజ్ సమీపంలో వర్షంలో పొడవైన చెట్టు దారికి అడ్డుగా పడడంతో రవాణా పరంగా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు అయ్యాయి. ఇదే రోడ్డు మార్గాన విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న మల్దకల్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న సుధాకర్ గమనించి చెట్టు కొమ్మను తొలగించడంతో ప్రయాణికుల రవాణా సౌకర్యానికి సుగమం అయ్యింది.ఇదే రోడ్డు మార్గాన వెళుతున్న ప్రయాణికులు కానిస్టేబుల్ సుధాకర్ ను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.వాస్తవమే కదా ఎక్కడైనా సమస్య ఉన్న సమయంలో ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఆశించకుండా మన వంతుగా సమస్యకు పరిష్కారం అయ్యే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేసినట్లయితే ఎవరికి ఎలాంటి సమస్య ఉండదని కానిస్టేబుల్ సుధాకర్ నిరూపించడం ప్రతి ఒక్కరికి ఆదర్శవంతం.

# తెలంగాణ సంస్కృతి కి ప్రతీక బతుకమ్మ వేడుక





**ఖని మున్సిఫ్ మేజిస్ట్రేట్ లు సచిన్ రెడ్డి, స్వారీక**

గోదావరిఖని టౌన్, రిపోర్టర్– (శుభోదయం న్యూస్):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ వేడుక అని ఖని మున్సిఫ్ మేజిస్ట్రేట్ లు నల్లాల వెంకట సచిన్ రెడ్డి, రామగిరి స్వారీక అన్నారు.ఈ మేరకు గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యం లో గురువారం రాత్రి అదనపు జిల్లా న్యాయస్థానం ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు వారు ముఖ్య అతిథు లు గా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచం లో ఎక్కడ లేని విధం గా పువ్వులనే దేవతలుగా భావించి పూజించే మహత్తర వేడుక బతుకమ్మ అని అన్నారు. అనంతరం మహిళా న్యాయవాదులు సిబ్బంది తో కలిసి న్యాయమూర్తి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బార్ అసోసియేషన్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు తౌటం సతీష్, సంజయ్ కుమార్, నాయకులు భారతి చౌహాన్ శోభ సబా తబస్సుమ్ గోపాల్ రెడ్డి ముచ్చుకుర్తి కుమార్ పంగ శంకర్, రాగం శ్రీధర్ పులిపాక రాజ్ కుమార్ ఉమర్,తో న్యాయవాదులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి దేవిగా అమ్మవారి అవతారం

**కొత్త మల్లూరు లో స్టార్ యూత్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో**

మంగపేట, సెప్టెంబర్ 26,శుభోదయం న్యూస్ రిపోర్టర్ :



తులసి మంగపేట మండలం, కొత్త మల్లూరు గ్రామంలో, దేవి శరన్నవరాత్రు ఉత్సవాల్లో, ఐదు రోజు మహాలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అశ్వయుజ మాసం ఆరంభంలో నిర్వహించే. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగన్మాతను వివిధ అలంకారాల్లో ఆరాధిస్తారు. దుర్గామాత రోజుకు అలంకారంలో దర్శనమిస్తుంది. మొదటిరోజు బాలా త్రిపుర సుందరిగా, రెండో రోజు వేదమాత గాయత్రి గా, మూడోరోజు అన్నపూర్ణ దేవిగా, నాలుగో రోజు కాత్యాయనీ దేవిగా అనుగ్రహించిన అమ్మవారు. శుక్రవారం రోజున మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని లక్ష్మీదేవి రూపంలో లక్ష రూపాయలతో, అత్యంత వైభవంగా అలంకరించి దంపతులతో కుంకుమ పూజ నిర్వహించారు. సిరి సంపదలు, అష్ట ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారును కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, బట్ట శ్రీకృష్ణ, పెందుర్తి శ్రీలత, బట్ట పుష్పావతి, మాటూరి రమాదేవి, బట్ట ధర్మావతి మరియు భక్తులు పాల్గొన్నారు.

## మా మీద దయ తలిచి మాకు డ్రైనేజీ సౌకర్యం ఇప్పించండి

గద్వాల్, జిల్లా ప్రతినిధి –రమేష్ (శుభోదయం న్యూస్) :



జోగులాంబ గద్వాల 23వ వార్డు తెలుగు పేట నందు ఎక్కడ ఉన్న వార్డు ప్రజలు చాలా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు ఇక్కడ డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపునీలు ఇండ్ల లోపలికి వస్తున్నాయి అలాగే చుట్టుపక్కల ముళ్ళ కంపలు చాలా పెరిగాయి అధికారులు పట్టించుకోవడం లేదు. రాజకీయ నాయకులు కూడా పట్టించుకోవడం లేదు ఓర్పు అడగడానికి మాత్రం బాగానే వస్తదని వాడు ప్రజలు చెబుతున్నారు ఎక్కడ ఉన్న సమస్యను దాదాపు పది సంవత్సరాల నుంచి చెప్తూనే ఉన్నాము మా బాధ ఎవరికి పట్టడం లేదు ఇక్కడ డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపు నీళ్లు అన్నీ ఇక్కడే ఇండ్ల లోపలికి వచ్చేస్తున్నాయి మున్సిపాలిటీ అధికారులకు విన్నవిస్తున్నాము మాకు డ్రైనేజీ సౌకర్యం కల్పించండి చుట్టుపక్కల ఉన్న పనికిరాని చెట్లను కూడా తొలగించాలని మున్సిపాలిటీ అధికారులకు విన్నపిస్తున్నాము ఈ భారీ వర్షాల వల్ల నాకు చాలా ప్రమాదకరంగా వర్షపునీలు ఇండ్ల లోపలికి వచ్చేసాయి ఇక్కడ ఉన్న రాజకీయ నాయకులు కూడా చాలాసార్లు వచ్చారు చూశారు వెళ్లిపోయారు అంతే అక్కడికే లాస్ట్ మళ్లీ తిరిగి ఇటువైపు చూడలేదు.

## చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నివాళులర్పించిన బి ఆర్ ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

మంగపేట, సెప్టెంబర్ 26, శుభోదయం న్యూస్ రిపోర్టర్ :తులసి



వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా, ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి ఆర్ ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు హాజరై చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఏటూరునాగారం మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ. తెలంగాణ వీర వనిత, ధైర్య శాలి చాకలి(చిట్యాల) ఐలమ్మ అనాడు నిరంకుశ నిజాం రజాకార్లను, దేశ్ ముఖులను ఎదుర్కొన్నది.నిజాం పాలన, విస్నూరు దేశ్ ముఖ్ కి వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు. ఆనాటి ఉద్యమమే, తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది అయింది. ఆ తర్వాత మలి దశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అయ్యింది. చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ చూపుతూ ఆనాటి దేశ్ ముఖులు, రజాకార్ల గుండెల్లో భయం పుట్టించింది.ఒకవైపు సాయుధ పోరాటం చేస్తూనే, మరోవైపు అమ్మ లాగా ఉద్యమకారులకు అన్నం పెట్టి ఆదరించిన మహనీయురాలు.ఐలమ్మ, స్ఫూర్తి తోనే మాజీ సీఎం కెసిఆర్ తెలంగాణ సాధించారు.పరిపాలన లో ఉద్యమ స్ఫూర్తిని పాటిస్తున్నారు.అందుకే తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా మారింది.ఐలమ్మ జయంతి, వర్ధంతి లను అధికారికంగా నిర్వహించే విధంగా,చర్య చూపిన సీఎం కెసిఆర్ కి ధన్యవాదాలు.భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. అనంతరము చాకలి ఐలమ్మ విగ్రహానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ ములుగు జిల్లా సీనియర్ నాయకులు,మండల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరు, (శుభోదయం న్యూస్):



నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బిహెచ్ఇఎల్ టౌన్షిప్ లో నివసిస్తున్న షేక్ ఇబ్రహీం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో షేక్ ఇబ్రహీం కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, శ్రీధర్ చారి, చంద్రశేఖర్, రామిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి 9 తెగల ధర్మ యుద్ధం మహాసభను విజయవంతం చేయాలి

**మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మండల అధ్యక్షులు తాటి నాగరాజు**

మంగపేట, సెప్టెంబర్ 26, (శుభోదయం న్యూస్) రిపోర్టర్ – తులసి:



ములుగు జిల్లా, మంగపేట మండలంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు మాట్లాడుతూ.చట్టబద్ధత లేని లంబాడీలను,ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ 1976 లో అక్రమంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలికంగా విద్యపరంగా, వాలా రాజకీయ ప్రయోజనాల కోసం, జీవో ద్వారా వెనకబడిన వారు. అనే నెపం తీసుకొచ్చి కేవలం విద్య పరంగా, డిఎన్ టి, లుగా అవకాశం ఇస్తే అదే ఆసరా చేసుకుని ఎస్టీలుగా చలామణి అవుతూ. తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసులకు దక్కాల్సిన అందాల్సిన పోలాలు విద్య ఉద్యోగం ఉపాధి రిజర్వేషన్లు అన్నిటిని దోసుకుంటూ అనుభవిస్తూ. ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. అందుకు ఆదివాసులు అందరూ ఐకమత్యంతో గూడెం గూడెం కదిలి ఆదివాసుల కదం తొక్కాలి. ఆదివాసుల హక్కులకై అస్తిత్వంకై పోరాడే సమయం ఆసన్నమైంది. అందుకు సెప్టెంబర్ 28 భద్రాచలంలో జరిగే 9 తెగల ధర్మ యుద్ధం మహాసభను విజయవంతం చేయాలని, పిలుపునిస్తున్న మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు ,మన్య సీమ నాయకులు తోలేం నరసింహారావు, తోలేం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్చెరు, (శుభోదయం న్యూస్):




గడిలపై గళమెత్తి, తెలంగాణ రాష్ట్రంలో భూ పోరాటానికి నాంది పలికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించి మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ పేరును హైదరాబాదులోని మహిళా విశ్వవిద్యాలయానికి నామకరణం చేశారని గుర్తు చేశారు. వారి వారసులకు సైతం సముచిత గౌరవం కల్పించారని పేర్కొన్నారు. ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలోమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకటేష్, రజక సంఘం అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులు పోస్ట్ ఆఫీస్ సేవలను ఉపయోగించుకోవాలి





**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ**

రామగుండం మండలం, రిపోర్టర్ – (శుభోదయం న్యూస్):

ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో పోస్ట్ ఆఫీస్ సేవలను ఉపయోగించుకోవాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ),రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ అన్నారు. లోక కళ్యాణ్ మేళా లో భాగంగా శుక్రవారం మెప్మా ఆద్వర్యంలో వీధి వ్యాపారుల కు డిజిటల్ లావా దేవీల నిమిత్తం పోస్ట్ ఆఫీస్ క్యూ ఆర్ కోడ్ స్కానర్ లను ప్రదానం చేశారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ ఖాతా లావా దేవీలతో క్యాష్ బ్యాక్ ప్రయోజనాలను కూడా వీధి వ్యాపారులు పొందవచ్చుని అన్నారు. పి ఎం విశ్వ కర్మ, పి ఎం స్వనిధి ,పి ఎం జె బి వై తదితర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందడానికి పోస్ట్ ఆఫీస్ ఖాతా ఉపయోగ పడుతుందని అన్నారు.పోస్టల్ మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ ఖాతా తో దేశం లోని ఏ పోస్ట్ ఆఫీస్ కు వెళ్లయినా వేలిముద్ర ఆదారంగా డబ్బులు డ్రా చేసుకోవచ్చని అన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఓ టి పి లు ఇతరులకు షేర్ చేయవద్దని ఎ పి కె లింక్ ఫైల్స్ తెరవ కూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి మెప్మా టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ మౌనిక సి ఓ లు శ్వేత ఊర్మిళ శమంత ప్రియ దర్శిని పోస్టల్ అధికారి భావన పలువురు వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## భూమి భుక్తి కోసం పోరాటం చేసిన మహిళ..

**చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ : ఎస్పీ**

సంగారెడ్డి, జిల్లా ప్రతినిధి – అనిల్ (శుభోదయం న్యూస్):




సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎస్పీ పారితోష్ పంకజ్ ఆధ్వర్యంలో పూలమాలవేసి శుక్రవారం నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.... తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, బుక్తి, కోసం ఐలమ్మ పోరాటం చేసినట్లు చెప్పారు, ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# చిన్నపాటి వర్షానికి స్థానిక ఇండ్లలోకి భారిగా వర్షం నీరు





శంకర్ పల్లి, సెప్టెంబర్ 26, (శుభోదయం న్యూస్) ప్రతినిధి ప్రవీణ్:

శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని ఎనిమిదవ వార్డులో కొత్తగా నిర్మించిన ఓపెన్ డ్రైనేజ్ పై అడ్డంగా గోడ పెట్టడం వలన వర్షపు నీరు భారిగా చేరి స్థానికుల ఇళ్లల్లోకి రావడం జరిగింది. అలాగే నూతనంగా నిర్మించిన ఓపెన్ డ్రైనేజ్ వ్యవస్థ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లోని వాటర్ పోకుండా అడ్డుగా ఉండటం వలన అండర్ గ్రౌండ్ నుండి నీరు పైకి వచ్చి పలు ఇళ్లలోకి వచ్చాయని సమస్య వలన ప్రజలు చాలా ఇబ్బందిలకు గురయ్యారు కొంతమంది ఇళ్లను ఖాళీ చేసి వేరే రూమ్ లోకి వెళ్లా వలసి వస్తుందని ఇలా ఉంటే మున్సిపల్ కమిషనర్ కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకుపోకపోవడం వలన ఈరోజు ఇలాంటి పరిస్థితికి దారి తీశాన్ని స్థానిక ప్రజలు అన్నారు. ఫతేపూర్ కౌన్సిలర్ రాములు మాట్లాడుతూ ఈ అండర్ గ్రౌండ్ వ్యవస్థ నూతనంగా నిర్మించిన ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థ వలన కూడుకుపోయిందని కమిషనర్ కు మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పిన పలు రకాల కారణాలతో నిర్లక్ష్యం చేశారని, ఈ సమస్యలకు పరిష్కారం లభించే వరకు నేను కూడా బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ప్రజల ఇళ్లల్లోకి వర్షపు నీరు రావడం చాలా బాధాకరమని ఈ వ్యవస్థకు మున్సిపల్ అధికారులే కారణమని, తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. శంకర్పల్లి మున్సిపల్ లోని 8వ వార్డు అయిన ఫతేపూర్ గ్రామంలో ఈ సమస్య దృష్టికి వచ్చిందని దీనికి కొన్ని కారణాల వల్ల నిర్లక్ష్యం అయిందని ఇందులో చాలా దిగువకు ఉండటం వల్ల ఇండ్లల్లోకి ఉండడం వల్ల వర్షం నీరు ఇళ్లలోకి వస్తుందని, రెండు రోజుల్లో పనులు అండర్ డ్రైనేజ్ పనులు మరియు సిసి రోడ్ పనులు మొదలవుతాయని ఆయన అన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరాలకు స్ఫూర్తి దాయకం

**బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ యాసిన్**

తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,(శుభోదయం న్యూస్), సెప్టెంబర్ 26:



వీరనారి చాకలి ఐలమ్మ జయంతినీ పురస్కరించుకొని తెలంగాణ భవన్ లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా బీఆర్ ఎస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ యాసిన్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బానిస బతుకులకు వెట్టిచాకిరికి, భూస్వాములు జమిందారుల దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాడిన తీరును కొనియాడారు. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాట పటిమ కలిగిన మహిళ అని, భూస్వాములు జమీందారుల ఇళ్లల్లో బలహీన వర్గాల మహిళలు వెట్టి చాకిరి చేసేవారని ఆ వెట్టి చాకిరికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ గారు పోరాడారని చెప్పారు. రైతులు తాము పండించిన పంటను జమీందారులు, భూస్వాములు, దళారులు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వచ్చేదని, దానితో రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యేవారని, ఆ దోపిడీకి వ్యతిరేకంగా వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం చేశారని, ఆమె పోరాట పటిమ నేటి తరాలకు స్ఫూర్తి దాయకమని చెప్పారు.భావి తరాలకు ఆమె ఖ్యాతిని తెలుపాలని సూచించారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..**

రేగొండ మండల రిపోర్టర్ మంతెన సురేష్ (శుభోదయం న్యూస్)



జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.ఈనెల 24న జిల్లా కేంద్రంలోని ఇల్లంద క్లబ్ హౌస్ లో జరిగిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా మూడవ మహాసభలలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ప్రకటించారు.కాగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీ నాయకులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ నాయకులకు ఎమ్మెల్యే జి ఎస్ ఆర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారదిగా ఉంటూ పనిచేయాలన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, అవినీతి అక్రమాలను వెలికి తీయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా వార్తలు రాయాలని సూచించారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎర్రం సతీష్ కుమార్, జిల్లా కార్యదర్శి గుజ్జ సారేశ్వర్ రావు, కోశాధికారి మండల రాంబాబు, జాయింట్ సెక్రటరీలు సుంకరి శ్రీధర్, తూటీచర్ల దుర్గయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యులు కొలుగూరి సంజీవరావు, తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి బండి కమలాకర్, జిల్లా నాయకులు పుల్ల సృజన్ తదితరులు ఉన్నారు.

# చిట్కుల్ లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్





పటాన్చెరు, (శుభోదయం న్యూస్):

పెత్తందారుల చేతిలో అణిచివేయబడ్డ వర్గాలకు తిరుగుబాటు తత్వాన్ని నేర్పించి ప్రతిఘటించే పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని చిట్కుల్ లోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర మొత్తం త్యాగదనుల అమరత్వమేనని ఆ మహనీయుల ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రశ్నించే తత్వం అలవడిందన్నారు. నిజాం నిరంకుశ పాలనలో శిథిలమైపోయిన బతుకులను బాగు చేయడానికి వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దొరలు జమీందారుల చేతుల్లో బానిసలుగా మగ్గుతున్న బహుజనులకు స్ఫూర్తినిస్తూ నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆనాడు బహుజనుల కోసం పోరాటం చేసిన ఆ మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు పంచాలనే సంకల్పంతో వీరనారి సబ్బండ వర్గాల ప్రతినిధి చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని చిట్కుల్లో ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ మహనీయుల త్యాగఫలంతో వారు ఇచ్చిన స్ఫూర్తితో సిద్ధించిన తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మహనీయుల ఆశయాల కనుగుణంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలని సంకల్పంతో హైదరాబాద్ లోని మహిళా యూనివర్సిటీ కి చాకలి ఐలమ్మ పేరుని పెట్టి ఆ వీరనారికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందన్నారు. రేవంతన్న స్ఫూర్తితో సబ్బండ, బడుగు బలహీన వర్గాల హక్కులకే పోరాడుతూ వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, మహేష్, సత్తయ్య, నర్సింలు, అర్జున్, గోపాల్, కిషోర్, చంద్రశేఖర్, రజక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జయంతి వేడుకలో పాల్గొన్న...

**గడ్డపోతారం కమిషనర్ జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్**

గడ్డపోతారం, (శుభోదయం న్యూస్):



సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ వావిలాలలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మేనేజర్ మధుసూదన్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అధికారులు నాయకులు మాట్లాడుతూ ఐలమ్మ చేసిన తెలంగాణ సాయుధ ఉద్యమం సేవలను పోరాటాలను గుర్తు చేశారు. రాబోయే భావితరాలకు ఐలమ్మ ఒక స్ఫూర్తిదాతగా ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు పాటుపడుదాం

**ధరూర్ రవి**

గద్వాల్, జిల్లా ప్రతినిధి - రమేష్ (శుభోదయం న్యూస్) :




భూమి కోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని టిపిసిసి సోషల్ మీడియా కో ఆర్డినేటర్, యువజన కాంగ్రెస్ గద్వాల తాలూకా జనరల్ సెక్రటరీ ధరూర్ రవి అన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ధరూర్ రవి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చాకలి ఐలమ్మ ఉద్యమించారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించి వారి ఆశయాలకు అనుగుణంగా అందరు సమిష్టిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సి.శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ సవారన్న,కంసలి రవి,మల్లీ, కరం రవి,పరుశరాముడు, నరేంద్ర, సాయన్న తదితరులు ఉన్నారు.

## ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలు చేయాలి

**జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ**

గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్ (శుభోదయం న్యూస్) :



గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా విగ్రహానికి జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరితమ్మ... పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. సరితమ్మ మాట్లాడుతూ ఆనాడు చాకలి ఐలమ్మ చూపిన తెగువ,పోరాటపటిమా తెలంగాణ యావత్ ప్రజానీకానికి, తెలంగాణ సాయిధ పోరాటానికి ఊపిరినిచ్చిందని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రం వస్తే తమ తలరాతలు మారుతాయని రాష్ట్ర సాధన పోరాటంలో ముందు వరుసలో ఉన్న బీసీలు, ఎన్నో ప్రాణ త్యాగాలు ఉన్నాయన్నారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి.ఆర్.శ్రీధర్, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, అల్వాల రాజశేఖర్ రెడ్డి,మాచర్ల వరలక్ష్మి వెంకటస్వామి గౌడ్,పటేల్ శ్రీనివాసులు, కపట్రాల వెంకట్రాములు,పాతపాలెం ఆనంద్ గౌడ్,బరాస ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ సవారన్న,సి.శ్రీనివాసులు రజక సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకుల తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు పృథ్వీరాజ్

పటాన్చెరు, (శుభోదయం న్యూస్):



చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ ఈ సందర్భంగా ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి సమాజంలో ఎప్పటికీ నిలిచిపోతుంది. రైతాంగం, కూలీలు, బలహీన వర్గాల కోసం ఆమె చేసిన త్యాగాలు స్ఫూర్తిదాయకం. యువతరం ఆమె ఆలోచనలతో ముందుకు సాగితేనే సమాజంలో నిజమైన సమానత్వం, న్యాయం సాధ్యమవుతుంది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని చాకలి ఐలమ్మ జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

# బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్







**బీర్కూర్,మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో నీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి అధ్యక్షత నా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తల్లితండ్రులు కళాశాల కు రెగ్యులర్ గా పంపవలసింది గా కోరారు. అదేవిధంగా ప్రభుత్వం ఇంటర్మీడియట్ కళాశాలకు జేఈఈ మెయిన్స్, నీట్ ఫిజిక్స్ వాల ,కాన్ అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్లాసుల గురించి ప్రతి క్లాసులో సీసీ కెమెరా పెట్టి కామండ్ కంట్రోల్ రూం లో బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ వారి పర్యవేక్షణలో. తరగతుల నిర్వహణ జరుగుతుంది అని వివరించారు ప్రతి ఒక్క పేరెంట్ విద్యార్థులకు రెగ్యులర్ గా కళాశాలకి పంపి ఉత్తమ ఫలితాలు తీసుకొచ్చేల సహకరించాలని వేడుకున్నారు. తదనంతరం కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ ఆటలో సంబరాల్లో విద్యార్థుల తో పాటు మండల ప్రజా ప్రతినిధులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు,మాజీ ఎంపీపీ తిలకేశ్వరి రఘు,నాయకులు బసవరాజు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పద్మ,మేకల విట్టల్, ప్రిన్సిపాల్ సర్ కళాశాల అధ్యాపకులు చంద్రశేఖర్, సత్తన్న, రంజిత్, దేవి సింగ్, సతీష్ ,నారగౌడ్ , సౌమ్య, బాలకిషన్, సుభాష్, రాకేష్ విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది

# వాయిల సింగారంలో ఘనంగాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు





**యువశక్తి యూత్ కమిటీ ఆధ్వర్యంలో**

**అనంతగిరి. సెప్టెంబర్ 26 (శుభోదయం న్యూస్):**

అనంతగిరి మండలం పరిధిలోని వాయిల సింగవరం గ్రామంలోని దేవీ నవరాత్రులు(బతుకమ్మ వేడుకలు) ఘనంగా నిర్వహించుచున్న యువశక్తి యూత్ కమిటీ సభ్యుల అంగరంగ వైభవంగా కన్నుల పండగ నిర్వహించుచున్నారు యాదవ బజార్ ప్రతి సంవత్సరం నిర్వహించుచున్నటు వంటి.. అమ్మవారూ తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాలుగా భక్తులకు దర్శనమిస్తూభక్తు లకు కొలిచేవారికి కొంగుబంగా పూజలందుకొంటున్నారు..... దుర్గామాత దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించువారు అర్చకులు. సూర్యనారాయణ శర్మ మండపంలోని ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చకులు చేత వేదమంత్రాలతో నిర్వహించారు తదనంతరం కనకదుర్గమ్మ మండపం ముందు బతుకమ్మలను చుట్టు సంప్రదాయబద్ధం గా బతుకమ్మలను పాటలకు చిందులు వేస్తూ కోలాటాలతో ఆటపాటలతో ప్రత్యేక నృత్యాలు చేస్తూ సందడి చేయగా చిన్నారులు కేరింతలు బతుకమ్మ పండగ శోభ వర్ణితమై పండుగ వాతావరణం నెలకొన్నది నవరాత్రులు ముగిసే వరకు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని శాంతి శేషులు తీసుకురావాలని అమ్మవారిని కరుణ కటాక్షం ప్రతి భక్తుని పైన ఉండాలని యువశక్తి యూత్ సభ్యులు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ నాయకులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## బాధితులను పునరావాస కేంద్రానికి తరలించిన ఎస్సై

**బీర్కూర్,మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):**



కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ నుంచి అతిభారీ వర్షాల కారణంగా మట్టిగోడలతో శిథిలావస్థలం కు చేరిన ఇండ్లలో ఉన్న బీర్కూర్ కు చెందిన కర్ల గంగా రాం కుటుంబానికి పునరావాస కేంద్రానికి తరలించిన బీర్కూర్ ఎస్సై మహేందర్

## స్థానిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ :** ప్రిసైడింగ్ అధికారులు అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణనిబం ధనలు పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కు హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకొని అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏవైనా అనుమానాలు, ఇబ్బందులు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బంది రాకుండాపోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా స్ట్రాంగ్ రూములు, బ్యాలెట్ బాక్సులు, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్లు తదితర సౌకర్యాలతో పాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల వేళ పొరపాట్లకు తావివ్వకుండా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

# రామాయంపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**రామాయంపేట (శుభోదయం న్యూస్) సెప్టెంబర్ 26:-**



మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో చిట్యాల చాకలి ఐలమ్మ 130వ జయంతి ఉత్సవాలను శుక్రవారం నాడు మెదక్ చౌరస్తాలో బీసీ సంఘం,రజక సంఘం నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మెదక్ జిల్లా బీసీ సంఘం గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం,రజక సంఘం అధ్యక్షులు సంగు సామి,కాంగ్రెస్ పార్టీ టిపిసిసి కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు,కాంగ్రెస్ నాయకులు సరాఫ్ యాదగిరి,రమేష్ రెడ్డి,దేమే యాదగిరి రజక సంఘం నాయకులు మేతరి కిషన్, కోనాపురం మల్లేశం,మామిడి సిద్దరాములు, పోచయ్యతో పాటు బీసీ సంఘం నాయకులు అల్లాడి వెంకటేష్ చింతల స్వామి,మద్దూరి భాను ఊర సత్యం తదితరులు హాజరై చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరనారిని చాకలి ఐలమ్మ నిజమైన వీరనారి,దళిత,బీసీ,వెనుకబడిన వర్గాల గౌరవ ప్రతిష్ఠ కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అన్నారు.ఆమె స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకం అవుతుందన్నారు.రాబోయే తరాలు చాకలి ఐలమ్మ చూపిన దారిలో నడవాలని,సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిసి,రజక సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా దుర్గామాత ఉత్సవాలు

**రామాయంపేట (శుభోదయం న్యూస్) సెప్టెంబర్ 26:-**



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో రెడ్డి కాలనీ దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు అమ్మవారు శ్రీ లక్ష్మీదేవి రూపంలో దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా 100కి పైగా మహిళా భక్తులు పాల్గొని సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఆచారపూర్వకంగా నిర్వహించారు.భక్తులు ఘనంగా పూజలు చేసి,అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమానికి రెడ్డి కాలనీ వాసులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజలు కూడా భారీ సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల నినాదాలతో మార్మోగింది. అనంతరం భారీ సంఖ్యలో వచ్చిన భక్తులకు పులిహోార కార్యక్రమాన్ని నిర్వహించి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన...

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్..**

**గద్వాల్, జిల్లా ప్రతినిధి -రమేష్ (శుభోదయం న్యూస్) :**



జిల్లా కేంద్రంలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ నేడు చాకలి ఐలమ్మ జయంతి దినోత్సవం సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ**

భూమికోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికే చాటి చెప్పి మహిళ లోకానికి స్ఫూర్తినిచ్చిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు.చిట్యాల ఐలమ్మ చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారిణి వీరవనిత తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని ఆమె సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు వెంకట్రాములు మల్దకల్, చిన్న రాముడు, అడవి ఆంజనేయులు, గోపాల్,అంజి, మీసాల కిష్టన్న, దొడ్డన్న, భూపతి నాయుడు, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేనిది

**బి ఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏ. ఎల్.ఆనంద్**

**తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్), సెప్టెంబర్ 26:**



చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేమని కంటోన్మెంట్ సీనియర్ నాయకుడు ఏ .ఎల్. ఆనంద్ అన్నారు. శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని కంటోన్మెంట్ మడ్ఫోర్ట్ దోబి ఘాట్ లోని చాకలిగా ఐలమ్మ విగ్రహానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏ . ఎల్.ఆనంద్ కార్యకర్తలతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆనంద్ మాట్లాడుతూ ..చాకలి ఐలమ్మ ఆమె స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రాని సాధించుకున్నమిని ఆమె ఆశయాలని భావితరాలకు అందించే బాధ్యత మన అందరిపైనా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాకేష్, దప్పుల శేఖర్, శత్రు, హరి ప్రసాద్, నల్ల రాజు, సునీల్, శేఖర్, మోహన్ రోషన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులుగా కురుస్తున్న వానకు పొంగి పొర్లుతున్న వాగులు వంకలు

**శంకర్ పల్లి, సెప్టెంబర్ 26, (శుభోదయం న్యూస్) ప్రతినిధి ప్రవీణ్:**



భారీ వర్షాల నేపథ్యంలో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. రైతులు పొలాల్లోకి వెళ్తున్నప్పుడు విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలి వాగులు వంకలు దాటే ప్రయత్నాలు చేయరాదు వర్షపు నీటి వల్ల రహదారులపై వాహనాలు స్కిడ్ అయ్యే అవకాశం అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దు దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి ఇలాంటి అత్యవసర సహాయం కోసం 100కి డయల్ చేయాలి ప్రతి ఒక్కరి ప్రాణం భద్రత అత్యంత ముఖ్యమైనది జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు సెప్టెంబర్ మాసంలో కురుస్తున్న వర్షం మరోవైపు గ్రామాల్లోని చెరువులు కూడా పొంగిపోతున్నాయి.

## స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధం అవుతున్న అధికారులు

**బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):**




రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే కొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగుతు నట్టు ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్న సమయం లో రాష్ట్ర వ్యాప్తంగా మండల వారిగా అధికారులు సిద్ధమవుతున్నారు. బీర్కూర్ మండల కేంద్రం లోని రైతువేదిక లో స్థానిక ఎన్నికలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం నిర్వహించిన అధికారులు.



# అనగనగా ఒక రాజు..

# నవ్వులు తెప్పిస్తోన్న నవీన్, మీనాక్షి!


జాతిరత్నాలు ఫేమ్ నవీన్ పోలిశెట్టి తాజాగా నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు ఈ చిత్రంలో గుంటూరు కారం బ్యూటీ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో నిలిచింది. ఈ మూవీకి మారి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే టీజర్ రిలీజ్ చేయగా.. సినీ ప్రియులను తెగ నవ్వించేసింది. ఇంకా ఈ మూవీ రిలీజ్‌కు దాదాపు మూడు నెలలకు పైగానే సమయం ఉంది. అయినప్పటికీ మేకర్స్ ముందుగానే ప్రమోషన్స్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో హీరో, హీరోయిన్లు నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి చాలా సరదాగా నవ్వులు పండించారు. సినిమా ప్రమోషన్‌లో 24 క్యారెట్స్ గోల్డ్ అంటూ ఫన్నీగా ప్రోమోలో మెప్పించారు. ఇంకెందుకు ఆలస్యం ఈ ప్రోమోను చూసి ఎంజాయ్ చేయండి. కాగా.. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీకి మిక్కీ జె మేయర్ సంగీతమందిస్తున్నారు.

# అందాలతో కవ్విస్తోన్న కావ్య శ్రీ



బిగ్‌బాస్ సీజన్ 9 ఇప్పుడు మూడో వారం నడుస్తుంది. మొత్తం 15 మంది కంటెస్టెంట్స్ హౌస్ లోకి వెళ్లగా.. ఇప్పుడు 13 మంది ఉన్నారు. ఇక నిన్నటి ఎపిసోడ్ లో కామనర్ దివ్య నికితా హౌస్ లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. త్వరలోనే మరో సెలబ్రెటీ వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. బిగ్‌బాస్ సీజన్ 9 మూడో వారం ఎలిమినేషన్ సమయం దగ్గర పడింది. ఇప్పటికే మనీష్, శ్రష్టి వర్మ ఎలిమినేట్ కాగా.. ఇప్పుడు మరొకరు హౌస్ నుంచి బయటకు రానున్నారు. మరోవైపు వైల్డ్ కార్డ్ ఎంట్రీస్ స్టార్ట్ చేశారు. ఇప్పటికే కామనర్ దివ్య నికితా హౌస్ లోకి అడుగుపెట్టింది. ఇక త్వరలోనే సీరియల్ బ్యూటీ కావ్య శ్రీ హౌస్ లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఆమెతోపాటు మరో నలుగురు సైతం ఎంట్రీ ఇవ్వనున్నట్లు టాక్. అయితే ఇప్పటికే కావ్య శ్రీ పేరు కన్ఫార్మ్ అయినట్లు తెలుస్తోంది. బుల్లితెర ప్రేక్షకులకు కావ్య గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. తెలుగు జనాలకు ఇష్టమైన హీరోయిన్ ఈ అమ్మడు. గోరింటాకు, చిన్ని సహా పలు సీరియల్స్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది కావ్య. అలాగే బిగ్ బాస్ సీజన్ 8 సమయంలోనూ ఈ అమ్మడు పేరు మారుమోగింది. సీజన్ 8 విన్నర్ నిఖిల్, కావ్య ఒకప్పుడు ప్రేమలో ఉన్నారు. కానీ కొన్నాళ్లకే వాళ్లిద్దరు విడిపోయారు. దీంతో సీజన్ 8 సమయంలో నిఖిల్ చేసిన కామెంట్స్..కారణంగా కావ్య పేరు తెగ వినిపించింది. ఇక ఇప్పుడు సీజన్ 9లోకి ఈ అమ్మడు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే మొదట్లో బిగ్ బాస్ లోకి రావడానికి ఒప్పుకొని కావ్య.. తర్వాత గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. దీంతో ఇప్పుడు ఆమె ఫోటోస్ నెట్టింట తెగ వైరలవుతున్నాయి.

## గోట్ ఫైట్ నేపథ్యంలో 'జాకీ'




భారతీయ సినిమాలో తొలిసారిగా మట్టి రేసింగ్ నేపథ్యంలో రూపొందిన 'మడ్డీ' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. అదే విజయోత్సాహంతో మరింత ఆసక్తికరమైన కథాంశంతో, ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచడానికి డా.ప్రగభల్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'జాకీ'. పీకే7 స్టూడియోస్ సమర్పణలో డైరెక్టర్ డా.ఎ ప్రగభల్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల అయింది. 'వినుత్నమైన కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో గోట్స్ ఫైట్ ఆసక్తికరంగా ఉంటాయి. ముఖ్యంగా మధుర్కైలో సాంప్ర దాయంగా కొనసాగుతున్న ఈ గోట్ ఫైట్ చుట్టూ అల్లుకున్న కథతో దీన్ని తెరకెక్కించాం. కేవలం ఫైట్స్ మాత్రమే కాదు అద్భుతమైన భావోద్వేగాలతో ప్రేక్షకులను కట్టిపడేసేలా ఈ సినిమా ఉంటుంది. రియల్ లోకేషన్స్‌లో చిత్రీకరించడమే కాకుండా 2022 నుంచి అక్కడి సాంస్కృతి సాంప్రదాయాలను అర్థం చేసుకోవడానికి అదే ప్రాంతంలో ఉన్నాను. సహజ సిద్దంగా చిత్రీకరించేందుకు అక్కడి ప్రజలతో మమేకమై, ప్రతీదీ తెలుసుకొని జాగ్రత్తగా షూట్ చేశాం' అని దర్శకుడు ప్రగభల్ చెప్పారు.

# అధికార మదం తలకెక్కిన బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**- అఖిల భారత చిరంజీవి యువత**





అసెంబ్లీ వేదికగా మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి వ్యంగంగా మాట్లాడిన నందమూరి బాలకృష్ణ వెంటనే చిరంజీవికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అఖిల భారత చిరంజీవి యువత తెలిపింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు ఒక లేఖను విడుదల చేశారు. అసెంబ్లీ సాక్షిగా మెగాస్టార్ శ్రీ చిరంజీవి గారిని ఉద్దేశించి వ్యంగంగా మాట్లాడిన నందమూరి బాలకృష్ణ గారు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. తనను తాను అతీత శక్తిగా భావించుకుంటూ నందమూరి బాలకృష్ణ గారు మెగా కుటుంబంపై గతంలో కూడా అనేక సార్లు అవమానకరంగా మాట్లాడటం జరిగింది. వివాదాలకు దూరంగా ఉండే మా చిరంజీవి గారు ఎప్పుడూ వాటిపై స్పందించలేదు. అభిమానులుగా మేము కూడా ఆయన మనసెరిగి సంయమనం పాటించాము. బాలకృష్ణ గారి కుటుంబం తీవ్ర వేధింపులకు గురై, జైలు పాలైనప్పుడు అండగా నిలుచుందీ%ొ% ఆయన కుటుంబం అధికారంలోకి రావడానికి అహర్నిశలూ కృషి చేసింది మెగా కుటుంబమే అన్న విజ్ఞత మరిచి, అధికార మదం తలకెక్కించుకున్న బాలకృష్ణ గారు నేడు చట్టసభల్లో సైతం చిరంజీవి గారి ప్రతిష్టను దిగజార్చేవిధంగా మాట్లాడేందుకు తెగించారు. ఈ వ్యాఖ్యలు మా దైవం చిరంజీవి గారిని సైతం బాధించాయని ఆయన ప్రతిస్పందన ద్వారా అర్ధమవుతోంది. మెగా కుటుంబం అండగా నిలవకపోయుంటే మీ పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో ఒక్కసారి ఊహించుకుంటే మంచిదని హితవు పలుకుతున్నాం. మరోసారి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడితే మెగా అభిమానుల తీవ్ర ఆగ్రహాన్ని చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంటుందని విన్నవిస్తున్నాం. చిరంజీవి అభిమానులుగా మేము సైతం బాలకృష్ణ వైఖరిని, వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే బాలకృష్ణ గారు స్పందించి, బహిరంగ క్షమాపణలు తెలపాలని డిమాండ్ చేస్తున్నాం. లేని యెడల బాలకృష్ణ గారు ప్రజాక్షేత్రం తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తున్నాం. అంటూ అఖిల భారత చిరంజీవి యువత తెలిపింది.




## అఫీషియల్..

## 'ఓజీ' మొదటి రోజు కలెక్షన్లు ఎంతంటే.!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన తాజా చిత్రం 'ఓజీ' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా మొదటిరోజు కలెక్షన్స్‌ని చిత్రబృందం సోషల్ మీడియాలో ప్రకటించింది. ఈ చిత్రం మొదటిరోజు రూ.154 కోట్ల వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో మొదటిసారి పవన్ కళ్యాణ్ డే1లో రూ.100 కోట్లు కలెక్షన్లు సాధించిన హీరోగా రికార్డులకెక్కాడు. సుజిత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై దానయ్య నిర్మించాడు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటించగా, హీరోయిన్‌గా ప్రియాంక అరుల్ మోహన్ పవన్ సరసన కథానాయికగా నటించింది. అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శుభలేఖ సుధాకర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రల్లో మెరిశారు.



# రూ.100కోట్ల వసూళ్లు..

# నేడు ఓటీటీలో స్ట్రీమింగ్

మాలీవుడ్ ఇండస్ట్రీ రికార్డ్ ను తన పేరుతో రాసుకున్న మోహన్ లాల్ ఇటీవల తుడరమ్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. ఆ సినిమా రిలీజ్ అయిన కొద్దీ రోజుల గ్యాప్ లోనే హృదయపూర్వం అనే మరో ఫ్యామిలీ ఓరియెంటెట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఓనమ్ కానుకగా హృదయ పూర్వం వరల్డ్ వైడ్ గ రిలీజ్ అయింది. ఎంపురాన్, తుడారమ్ తో డబుల్ హండ్రెడ్ క్రోర్ చిత్రాలను దింపిన లాలట్టన్.. హృదయపూర్వం హ్యాట్రిక్ హిట్ అందుకున్నాడు. ఓనం రోజు అనేక సినిమాలు రిలీజ్ అయిన కూడా హృదయపూర్వం సూపర్ హిట్ టాక్ తో రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. కాగా ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ కు వచ్చేసింది. ఓటీటీలో మలయాళ సినిమాలకు ఉండే క్రేజ్ వేరు. అందుకే వీకెండ్ వస్తుందంటే.. మాలీవుడ్ మూవీస్ కోసం ఈగర్లీ వెయిట్ చేస్తుంటారు. ఎవ్రీ ఫ్రైడేలాగా ఈ వీకెండ్ కూడా మలయాళ స్టార్ మోహన్ లాల్ నటించిన హృదయ పూర్వం డిజిటల్ స్ట్రీమింగ్ కు వచ్చింది. రిలీజ్ కు ఈ ముందే ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్ స్టార్ కొనుగోలు చేసింది. థియేటర్ సూపర్ హిట్ అయిన ఈ సినిమా ఆగస్టు 28న రిలీజ్ కాగా నాలుగు వారల అనంతరం సెప్టెంబర్ 26 అనగా ఈ రోజు నుండి జియో హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ్. కన్నడ, హిందీ వంటి పాన్ ఇండియా భాషల్లో హృదయపూర్వంను స్ట్రీమింగ్ చేస్తోంది హాట్ స్టార్.